



సీసీ కెమెరాల ఏర్పాటు

కీసర రూరల్, మే 31 : దొంగతనాల నివారణలో సీసీ కెమెరాలు రక్షణ కవచంలా ఉంటాయని మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీ పరిధి రాంపల్లిలోని మహంకాళీ దేవాలయంలో దాత గండి ఆంజనేయులుగౌడ్ రూ.60వేలు వెచ్చించి నూతనంగా ఏర్పాటు చేసిన ఆరు సీసీ కెమెరాలను ఆయనతో కలిసి ప్రారంభించారు. భూమయ్యయాదవ్, కౌన్సిలర్ నాగేష్‌గౌడ్, చింతలసరిత, రామకృష్ణారెడ్డి, నర్సింహగౌడ్ పాల్గొన్నారు.





మరో 3 రోజులు ఉత్కంఠ!

సార్వత్రిక ఎన్నికల ఫలితాల కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మే 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాల ఫలితాలపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. చేవెళ్ల స్థానంలో 43 మంది, మల్కాజిగిరిలో 22 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఓట్ల లెక్కింపునకు ఆయా నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు శశాంక, గౌతమ్‌ల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 4వ తేదీ ఉదయం ఆరు గంటలకల్లా లెక్కింపు కేంద్రాలకు అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్లు చేరుకుంటారు. కౌంటింగ్ విధుల్లో ఉండే అధికారులు, సిబ్బంది పొరపాట్లకు తావివ్వకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఫలితాలను ఆలస్యం చేయకుండా రౌండ్ల వారీగా వెంటవెంటనే ప్రకటించనున్నారు.పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తిచేసేందుకు ఎన్నికల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

- చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- ఎన్నికల ఫలితాలపై నేతలు, పార్టీలు, ప్రజల్లో ఉత్సుకత
- బీఎస్ఐటీలో చేవెళ్ల నియోజకవర్గ ఓట్ల లెక్కింపు
- మూడు చోట్ల మల్కాజిగిరి స్థానం ఓట్ల కౌంటింగ్
- విజయావకాశాలపై అభ్యర్థుల ధీమా

అందరి దృష్టి ఎన్నికల కౌంటింగ్‌పైనే..

(వికారాబాద్ /మేడ్చల్, ఆంధ్రజ్యోతి, మే 31): లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతోంది. ఎన్నికల ఫలితాలపై అందరిలో ఉత్కంఠ నెలకొంది. ఓట్ల లెక్కింపునకు మరో మూడు రోజులే ఉంది. జూన్ 4 ఉదయం నుంచి ఓట్లు లెక్కిస్తారు. ఎన్నికల ఫలితాలపై సాధారణ ప్రజలు సైతం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హోరాహోరీగా తలపడిన అభ్యర్థులు తమ విజయావకాశాలపై అంచనాలతో ధీమాగా ఉన్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓట్ల శాతంపై లెక్కలు ఇప్పటికే తీసుకున్నారు. అధికారులు కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ నియోజరవర్గాలున్నాయి. వీటి పరిధిలో మొత్తం 29,38,370 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 15,04,260 మంది కాగా, మహిళా ఓటర్లు 14,33,830 ఉన్నారు. 280 మంది ఇతరులు ఉన్నారు. మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 16,57,107 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓవరాల్‌గా 56.4శాతం పోలింగ్ నమోదైంది. ఈ స్థానం బరిలో 43 మంది అభ్యర్థులున్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో 8,53,237 మంది పురుషులు, 8,03,827 మంది మహిళలు, 43 మంది ఇతరులు ఉన్నారు. చేవెళ్ల మండలం గొల్లపల్లిలోని బండారు శ్రీనివాస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఉదయం 6గంటలకల్లా కౌంటింగ్ సిబ్బంది ఓట్ల లెక్కింపు కేంద్రం వద్దకు వస్తారు. ర్యాండమైజేషన్ జరిపిన తర్వాత నియోజకవర్గాల వారీగా టేబుళ్లను కేటాయిస్తారు. ఓట్ల లెక్కింపు కోసం మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 28 టేబుళ్లు, మిగతా నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలైన చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూర్ నియోజకవర్గాలకు 14 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా సిబ్బంది అన్ని విధాలా సన్నద్ధమయ్యారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. సమయం వృథా చేయకూడదని, అదే సమయంలో పొరపాట్లకు ఆస్కారం లేకుండా పూర్తి అప్రమత్తతతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించేలా జిల్లా ఎన్నికల అధికారి శశాంక చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగ్ అధికారులు, రాజకీయ పక్షాలు, అభ్యర్థులు, వారి ఏజెంట్లు అన్ని నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను అధికారులు.. అభ్యర్థులకు, వారి ఏజెంట్లకు తెలియజేస్తారు. ఈవీఎంల ఓట్లను ఒక్కో రౌండ్ వారీగా లెక్కిస్తూ, ప్రతీ రౌండ్ లెక్కింపు పూర్తిచేసిన తరువాత ఏజెంట్ల సంతకాలు తీసుకుంటారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏమైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు వెంటనే సరిచేసేలా సాంకేతిక సిబ్బందిని అందుబాటులో ఉంచుతారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో వివిధ కార్యకలాపాల నిర్వహణకు నియమించిన ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించేలా ట్రైనింగ్ ఇచ్చారు. కౌటింగ్ హాల్లోకి సెల్‌ఫోన్లను నిషేధించారు. కౌంటింగ్ సూపర్ వైజర్లు, సూక్ష్మ పరిశీలకులు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో క్రియాశీలక పాత్ర పోషించనున్నారు. కౌంటింగ్ సెంటర్‌లో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంటాయని, సిబ్బందికి అల్పాహారం, భోజనాలను కూడా కౌంటింగ్ కేంద్రాల ఆవరణల్లోనే ఏర్పాటు చేస్తారు.


హోలీమేరీ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న గౌతమ్

మల్కాజిగిరి లోక్‌సభ టేబుళ్ల వారీగా ఓట్ల లెక్కింపు వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	కౌంటింగ్ టేబుల్స్	రౌండ్ల సంఖ్య
మేడ్చల్	591	28	21
మల్కాజిగిరి	418	20	21
కుత్బుల్లాపూర్	592	28	21
ఉప్పల్	407	20	20
కూకట్‌పల్లి	417	20	21
కంటోన్మెంట్	232	14	17
ఎల్బీనగర్	571	28	20

చేవెళ్ల లోక్‌సభ టేబుళ్ల వారీగా ఓట్ల లెక్కింపు వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	కౌంటింగ్ టేబుల్స్	రౌండ్ల సంఖ్య
మహేశ్వరం	537	28	20
రాజేంద్రనగర్	543	28	20
శేరిలింగంపల్లి	633	28	23
చేవెళ్ల	298	14	22
పరిగి	305	14	22
వికారాబాద్	284	14	21
తాండూరు	277	14	20
పోస్టల్ బ్యాలెట్	19,290	24+1	02

గంటకు నాలుగు రౌండ్లు

ఒక్కో రౌండుకు 10 నుంచి 15 నిమిషాల సమయం పడుతుంది. గంటకు నాలుగు రౌండ్లు పూర్తవుతాయి. ఏడు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పూర్తయ్యాకే రౌండ్ల వారీగా ఓట్లను క్రోడీకరించి ఫలితం ప్రకటిస్తారు. ఉదయం 8గంటలకు లెక్కింపు ప్రారంభిస్తారు. మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో అత్యధికంగా 21రౌండ్ల లెక్కింపు జరుగనుండటంతో 5గంటలకుపైగా సమయం పడుతుంది. ఆ తర్వాతే తుది ఫలితం వెలువడనుంది. విజేత ఎవరో మధ్యాహ్నం 2గంటల కల్లా తెలిసే అవకాశమున్నా... అధికారికంగా మాత్రం సాయంత్రమే ప్రకటన వెలువడుతుందని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

లెక్కిస్తారిలా..

కౌంటింగ్ కేంద్రంలో ప్రతి నియోజకవర్గానికి ఏర్పాటు చేసిన టేబుళ్లపై రౌండ్లు, పోలింగ్ కేంద్రాల వారీగా కంట్రోల్ యూనిట్లను తీసుకొచ్చి రిజల్ట్ మీటనొక్కి అభ్యర్థులకు పడిన ఓట్లను నమోదు చేస్తారు. చివరగా 17ఏ ఫాంను పరిశీలించి పోలైన ఓట్లను సరిచూశాక అన్ని టేబుళ్ల వారీగా అభ్యర్థులకొచ్చిన ఓట్లను రౌండ్ల వారీగా వెల్లడిస్తారు. అభ్యర్థుల, ఏజెంట్ల సమక్షంలో ఒక్కో టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంటు, మైక్రోఅబ్జర్వర్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపడతారు.

మూడు చోట్ల కౌంటింగ్

ఇక ఓటర్ల పరంగా దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గమైన మల్కాజిగిరిలో ఈ నెల 13న ఎన్నికలు జరగ్గా.. ఏడు నియోజకవర్గాల పరిధిలో 2,528 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 39,79,596 మంది ఓటర్లకు 50.72శాతం మంది ఓటు వేశారు. నియోజకవర్గాల వారీగా ఓట్లను లెక్కించనున్నారు. ఎప్పటి మాదిరిగానే టేబుళ్లపై ఈవీఎంలకు అనుసంధానించిన కంట్రోల్ యూనిట్లతో లెక్కింపును కొనసాగిస్తారు. మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో ఏడు నియోజకవర్గాలుండగా.. మూడు చోట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మేడ్చల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును కీసరలోని హోలీమేరీ ఇంజినీరింగ్ కాలేజీలో.. ఎల్బీనగర్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపును సరూర్‌నగర్ స్టేడియంలో, కంటోన్మెంట్ నియోజకవర్గ ఓట్లను వెస్లీ కాలేజీలో లెక్కించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.



పకడ్బందీగా బడిబాట

- 3 నుంచి 19 వరకు నిర్వహణ
- అన్నిశాఖల అధికారుల భాగస్వామ్యం
- మండల, మున్సిపల్ స్థాయి ప్రత్యేక కమిటీల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి, మేడ్చల్/వికారాబాద్/తాండూరు, మే 31 : బడీడు పిల్లలు బడిలోనే ఉండాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లుగానే ఈసారీ పాఠశాల ప్రారంభానికి ముందు బడిబాట కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నెల 3 నుంచి 19 వరకు బడిబాట నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు కార్యక్రమాలు జరుగాలి. ఈ కార్యక్రమం ద్వారా బడి ఈడు పిల్లలను పాఠశాలలో ఉండేలా చేయడం, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించడం, మన బడిలో ప్రజలను భాగస్వాములను చేయడం వంటివి చేయాలి. నాణ్యమైన విద్యను అందిస్తామని తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా వారిని ప్రోత్సహించాలి. బడిబాట కార్యక్రమంలో రోజుకో కార్యక్రమం నిర్వహిస్తారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు సంఖ్యను పెంచడం, గుణాత్మక విద్యను అందించేందుకు కృషి చేస్తారు.

జిల్లా	మేడ్చల్	వికారాబాద్
ప్రాథమిక పాఠశాలలు	375	776
ప్రాథమికోన్నత పాఠశాలలు	22	111
ఉన్నత పాఠశాలలు	108	176
ఎయిడెడ్ పాఠశాలలు	10	05

ఏర్పాట్లు పూర్తి

మే 31న శుక్రవారం మండల స్థాయి, నేడు జూన్ 1న పాఠశాల స్థాయి సన్నద్ధ సమావేశాలు నిర్వహించాలి. జూన్ 3న బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించాలి. గ్రామస్తుల సహకారంతో బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని సమీప పాఠశాలలో చేర్పిస్తారు. 4న ఇంటింటికీ తిరిగి బడి ఈడు పిల్లలను గుర్తించి, వారి జాబితా తయారు చేయాలి. 5 నుండి 10వ తేదీ వరకు పాఠశాల పరిధిలోని పిల్లలను గుర్తించి వారు బడిలో చేరేలా చేయడం, అంగన్‌వాడీ కేంద్రంలో ఐదు సంవత్సరాలు పైబడిన వారిని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయించాలి. గ్రామ విద్యా రిజిస్టర్‌లో ఈ సందర్భంగా మార్పులు చేయాలి. 5వ, 7వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఉన్నత తరగతుల్లో నమోదు చేయించాలి. గత సంవత్సరంలో తక్కువ నమోదు ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికతో తల్లిదండ్రులను కార్యక్రమంలో భాగస్వాములను చేస్తూ ఈ విద్యాసంవత్సరంలో నమోదు పెంచడానికి కృషి చేయాలి. బాల కార్మికులను గుర్తించి, వారిని చదువుకునేలా చేయాలి. పుస్తకాలు, ఏకరూప దుస్తులు సిద్ధంగా ఉంచుకోవాలి. 11న తరగతి గదులను శుభ్రం చేయడం, మంచినీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. 12న పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా పండుగ వాతావరణంలో బడి తెరిచి తల్లిదండ్రులను పిలిచి వారితో సమావేశం కావాలి. మంచి ఫలితాలు సాధించిన పూర్వ విద్యార్థులతో ఇతర విద్యార్థులను ప్రోత్సహించాలి. 13న విద్యార్థులందరినీ బడికి రప్పించడం, 14న సామూహిక విద్యాభ్యాసం నిర్వహించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించాలి. 19వ తేదీ వరకు రెగ్యులర్ టీచింగ్ యాక్టివిటీస్‌లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి జిల్లా, మండల, గ్రామ అధికారులు కూడా బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

గ్రూప్-1 పరీక్ష ప్రశాంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మే 31: గ్రూప్-1 పరీక్షను ప్రశాంత వాతావరణంలో జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. ఈనెల 9న నిర్వహించే గ్రూప్-1 కు సంబంధించి శుక్రవారం కలెక్టరేట్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-1 పరీక్షను 13 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 5468 మంది అభ్యర్థులు హాజరు అవుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. వికారాబాద్‌లో 7, తాండూర్‌లో 4, పరిగిలో ఏర్పాటు చేసిన 2 కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు ఉండేలా జాగ్రతలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రశ్నాపత్రాలను స్ట్రాంగ్‌రూమ్ నుంచి పోలీస్ బందోబస్తు, ప్రొటోకాల్ ప్రకారం పరీక్షా కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. విధులు నిర్వహించే సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, రవీందర్ రెడ్డి, డా.రాజేష్, అమరేందర్, కృష్ణ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్

నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు నమోదు చేసి పీడీ యాక్ట్ పెట్టడం జరుగుతుందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని సురేష్ ఏజెన్సీని వ్యవసాయాధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి అందుబాటులో ఉన్న విత్తనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వికారాబాద్ జిల్లాలో 2.43 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేసే అవకాశం ఉందని, ఇప్పటికైతే 3.12లక్షల పత్తి విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. మార్కెట్ లో 20 రకాల హైబ్రీడ్ బ్రాండ్స్ అందుబాటులో ఉన్నాయని సూచించారు. నకిలీ విత్తనాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండి ఏమైనా సమాచారం ఉంటే వ్యవసాయ శాఖ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కర్ణాటక, కర్నూల్ నుంచి నకిలీ విత్తనాలు సరఫరా అవుతున్నట్లు సమాచారం ఉందని, గట్టి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

బ్యాలెట్ బాక్సులు వచ్చేశాయ్

- జిల్లాలో ఇది వరకే ఉన్న 1000 బాక్సులు
- కర్ణాటక నుంచి వచ్చిన 1900 బ్యాలెట్ యూనిట్లు
- పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఇంకా రాని స్పష్టత


వికారాబాద్ జిల్లాకు వచ్చిన బ్యాలెట్ బాక్సులు

వికారాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు బ్యాలెట్ బాక్సులు వచ్చేశాయి. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాకున్నా .. అవసరమైన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో విజయబావుటా ఎగుర వేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తరవాత.. జూన్ నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించినా.. ప్రభుత్వ పరంగా ఇంకా ఆదిశగా సన్నాహాలు ప్రారంభించలేదు. కాగా, పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం ఎప్పుడు ప్రకటన చేసినా... నిర్వహించేందుకు వీలుగా అధికార యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమైంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీతో ముగియనుంది. ఆ తరువాత పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం ప్రకటన చేస్తుందా, లేక వేచి చూసే ధోరణితో వ్యవహరిస్తుందా అనేది తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే, జిల్లాలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. జిల్లాలో 566 గ్రామ పంచాయతీలు ఉండగా, 4862 వార్డులు ఉన్నాయి. పంచాయతీ ఎన్నికలు ఎన్ని విడతల్లో నిర్వహిస్తారనే అంశంపైన బ్యాలెట్ బాక్సులు ఎన్ని అవసరమవుతాయనేది స్పష్టత వస్తుంది. గత పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో జరగగా, 3152 బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉంచారు. ఈసారి పంచాయతీ ఎన్నికల కోసం జిల్లా యంత్రాంగం ఇప్పటికే 2900 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసింది. జిల్లాలో ఇది వరకే 1000 బ్యాలెట్ బాక్సులు ఉండగా, కర్ణాటక నుంచి మరో 1900 బ్యాలెట్ బాక్సులు వచ్చాయి. ఇంకా బ్యాలెట్ బాక్సులు కావాల్సి ఉంటే జిల్లా కలెక్టర్ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ బీసీ రిజర్వేషన్ల అంశంతో ముడిపడి ఉన్న నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలపై ఇంకా స్పష్టత రాలేదని తెలుస్తోంది.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- కలెక్టర్ గౌతమ్

కీసర, మే 31: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు త్వరితగతిన ఏర్పాట్లను పూర్తి చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మాల్కాజ్‌గిరి పార్లమెంట్ సెగ్మెంట్‌లోని మేడ్చల్, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మాల్కాజ్‌గిరి అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలను కీసర మండలం భోగారం గ్రామంలోని హోలీమేరీ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచిన విషయం విదితమే. కలెక్టర్ గౌతమ్ శుక్రవారం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో సీసీ కెమెరా, వీడియో రికార్డు, బారీకెడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, అవసరమైతే జనరేటర్, ఇంటర్‌నెట్ సరఫరా వంటి మౌలిక వసతులు పూర్తి అయినట్లు అధికారులు కలెక్టర్‌కు తెలియజేశారు. ఇతరాత్ర పనులు త్వరితగతిన పూర్తి చేసి ఓట్ల లెక్కింపును పకడ్బందీగా చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ మహేష్, ఆర్‌డివో ఉపేందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



పంపిణీకి నోచని బతుకమ్మ చీరలు


పుట్టపహాడ్‌లో ఉన్న బతుకమ్మ చీరలు

కులకచర్ల, మే 31: బతుకమ్మ చీరలు పంపిణీకి నోచుకోక ఎనిమిది నెలలుగా మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వృథాగా ఉన్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 18 సంవత్సరాలు నిండిన మహిళలకు బతుకమ్మ పండగకు చీరలు పంపిణీ చేసింది. ఇదేక్రమంలో గత బతుకమ్మ పండగకు కూడా చీరలు పంపిణీ చేసేందుకు పంచాయతీలకు బతుకమ్మ చీరలు సరఫరా చేశారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయడంతో చీరల పంపిణీకి బ్రేక్ పడింది. ఉమ్మడి కులకచర్ల మండలంలోని 44 గ్రామ పంచాయతీలకు 16 వేల 615 బతుకమ్మ చీరలు వచ్చాయి. ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో బతుకమ్మ చీరల పంపిణీ మరుగునపడింది. పంచాయతీల్లో పంపిణీకి నోచుకోకుండా ఉన్న బతుకమ్మ చీరలను ఏం చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

పోటీ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

కొడంగల్ రూరల్, మే 31: ఎస్ఈయంఎస్ జాతీయ ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో కొడంగల్‌లోని నవీన ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ డీవీ.నరేశ్‌రాజ్ శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన శివరాం, రుచిత, సాహితి, దీపిక ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. అదేవిధంగా పదో తరగతిలో మెరుగైన ఉత్తీర్ణత సాధించిన చరణ్‌తేజ్, రాకేశ్, అజయ్ గురుకుల కళాశాలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల వ్యవస్థాపకుడు వెంకటయ్య, ప్రిన్సిపాల్ డీవీ.నరేశ్‌రాజ్, ఉపాధ్యాయులు అభినందించారు. వీరికి ఈ నెలలో హైదరాబాద్‌లో అవార్డులతో సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

అంకిత భావంతో పనిచేస్తే సంతృప్తి

● కలెక్టర్ సి నారాయణరెడ్డి


ఉద్యోగ విరమణ పొందిన అధికారులతో కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మే 31: ప్రతీఉద్యోగి నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తే మనసుకు సంతృప్తిని కలిగిస్తుందని వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి.అనిల్ కుమార్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డి.సుధారాణిలకు జిల్లా యంత్రాంగం, వివిధ శాఖల అధికారులు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ సర్వీస్‌లో అధికారులు నిజాయితీ, పారదర్శకతతో పనిచేయాలన్నారు. అనంతరం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి.అనిల్ కుమార్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డి.సుధారాణిలకు కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా యంత్రాంగం, వివిధ శాఖల అధికారులు జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఎస్సీ డీడబ్ల్యూవో మల్లేశం, పంచాయతీరాజ్ ఈఈ ఉమేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, డీవైఎస్‌వో హన్మంత్ రావు, డీటీడబ్ల్యూవో ఉపేందర్, జిల్లా ఆడిట్ అధికారి వీరభద్ర, డీడబ్ల్యూవో జ్యోతిపద్మ, జిల్లా మత్స్యశాఖ అధికారి చరితారెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి చెన్నమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సురేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు సెలవులు మంజూరు చేయాలి


డీఈవో రేణుకాదేవికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


కొడంగల్, మే 31: అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో భాగంగా వేసవి సెలవుల్లో పాఠశాలల మరమ్మతు పనులను పూర్తి చేయడం లాంటి విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని డీఈవో రేణుకాదేవికి వినతిపత్రం అందజేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఎస్టీయూ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, అసోసియేట్ అధ్యక్షుడు విష్ణుకుమార్‌లు డీఈవోతో కోరారు.

పాఠశాలల అభివృద్ధిలో కీలక పాత్ర వహించాలి


మరికల్ జడ్పీహెచ్‌ఎస్ సందర్శనలో పీఆర్ డీఈ హనుమంతు

కులకచర్ల, మే 31: పాఠశాలల అభివృద్ధిలో అమ్మ ఆదర్శ కమిటీలు కీలకపాత్ర వహించా లని పీఆర్ డీఈ హనుమంతు తెలిపారు. చౌడాపూర్ మండలం మరికల్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.













చందన్‌వెల్లి కుందన్ టెక్స్ టైల్స్ కంపెనీ వద్ద గ్రామస్థులు

టెక్స్‌టైల్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

షాబాద్, మే 31 : మండల పరిధిలోని చందన్‌వెల్లి వద్ద గల కుందన్ టెక్స్ టెక్స్‌టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి వెలువడే వాయు కాలుష్యం కారణంగా గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని, అనారోగ్యం పాలవుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి అన్నారు. ఈమేరకు ఆ కంపెనీ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం నగరంలోని మెంబర్ సెక్రెటరీ కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ కుందన్ పరిశ్రమ నుంచి వెలువడే వాయు కాలుష్యం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు దమ్ము, శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్య కారకాల వల్ల పశువులు నీటిని కూడా తాగడం లేదన్నారు. పంట పొలాలకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంతులు రాంచందర్‌రావు, ఆంజనేయులు, రాఘవాచారి, గోపాల్, కిష్టయ్య, మహేందర్‌రెడ్డి, నరేష్, రంగయ్య, సత్తయ్య, సుధాకర్‌రెడ్డి, మల్లేష్, యాదగిరి, కుమార్ తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.



కీర్తి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు

» యువత అధైర్య పడొద్దు.. : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, మే 31: సమస్యలు ఎదురైనప్పుడు యువత మనోధైర్యంతో ఎదుర్కొవాలే తప్ప ఆత్మహత్య చేసుకుని కన్న తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగిల్చవద్దని, ఆత్మహత్య అనేది సమస్యకు పరిష్కారం కాదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని రైతుకాలనీకి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు బుచ్చయ్య పెద్ద కుమార్తె కీర్తి గురువారం ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం బుచ్చయ్య ఇంటికి వెళ్లి కీర్తి మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ చదువుకున్న యువతీయువకులు సైతం చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్యలు చేసుకోవడం బాధకరమని అన్నారు. చదువులో ఫెయిల్ అయితే మళ్లీ పరీక్ష రాసి పాస్ కావడానికి అవకాశం ఉందని, ఒకసారి తీసుకున్న ప్రాణం తిరిగిరాదన్న విషయాన్ని గ్రహించాలని కోరారు. విద్యార్థి దశ నుంచే పిల్లల్లో మనోధైర్యం పెరిగేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. క్రమశిక్షణతో పెరిగి, మనోధైర్యంతో సమస్యలను పరిష్కరించుకుంటూ ఉన్నత స్థాయికి ఎదిగేవిధంగా విద్యార్థుల్లో పరివర్తన తేవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే శంకర్ అభిప్రాయపడ్డారు. బుచ్చయ్యను మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్‌తో పాటు పార్టీలకు అతీతంగా పట్టణ ప్రముఖులు పరామర్శించారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి సాంబశివరావు

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

చేవెళ్ల, మే 31 : మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని రిటైర్డ్ జడ్జి సాంబశివరావు తెలిపారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో శుక్రవారం చేవెళ్ల మున్సిఫ్ కోర్టు ఆవరణలో ట్రాఫిక్ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపవద్దన్నారు. మొత్తం 82 కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. ఇందుకుగాను రూ. 2లక్షల5వేల 500 జరిమానా విధించడం జరిగిందన్నారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఎస్సై విఠల్‌రెడ్డి, కోర్టు అధికారులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.



నర్సింహులుతో డీపీఆర్వో, సిబ్బంది

నర్సింహులు సేవలు అమోఘం

» పౌర సంబంధాల శాఖ జిల్లా అధికారి పద్మశ్రీ

రంగారెడ్డి అర్బన్, మే 31 : పౌర సంబంధాల శాఖలో సూపర్‌వైజర్‌గా నర్సింహులు చేసిన సేవలు అమోఘమని డీపీఆర్వో పద్మశ్రీ అన్నారు. ఈమేరకు శుక్రవారం పదవీ విరమణ పొందిన నర్సింహులును డీపీఆర్వోతో పాటు ఏపీఆర్వో, సిబ్బంది కలెక్టరేట్‌లోని వారి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ పీఆర్వో బాలేశ్వరి, ఏపీఆర్వో మధుసూధన్, ఏవీ సూపర్‌వైజర్ ప్రసాద్, టైపిస్టులు దయానంద్, అజీజ్, రికార్డు అసిస్టెంట్ సురేష్ గౌడ్, డ్రైవర్ ఈశ్వర్, ఫొటోగ్రాఫర్ ప్రవీణ్‌కుమార్, నాలుగో తరగతి సిబ్బంది ఫకీర్, చందన్, అనిత, హబీబాబేగం, షేక్ లియాఖత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

190 కిలోల నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

బషీరాబాద్, మే 31 : అక్రమంగా ఇంట్లో నిల్వ చేసిన 190 కిలోల నకిలీ విత్తనాలు పట్టుబడగా శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు బషీరాబాద్ ఎస్ఐ రమేష్ తెలిపారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలోని మంతట్టి గ్రామంలో జైపాల్‌రెడ్డి ఇంట్లో నకిలీ పత్తి విత్తనాలు ఉన్నాయనే సమాచారంతో సోదాలు నిర్వహించారు. అక్కడ 50కిలోల విత్తనాలు పట్టుబడినట్లు ఆయన వివరించారు. నకిలీ విత్తనాలతో పట్టుబడిన వ్యక్తిని ఆరాతీయగా ఆయనిచ్చినా సమాచారంతో దుద్యాల మండలం పల్లెగడ్డ గ్రామం ముకుంద్ రెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఆ ఇంట్లో 140కిలోల నకిలీ విత్తనాలు పట్టుబడగా స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు చెప్పారు. నకిలీ విత్తనాలతో పట్టుబడిన ఇరువురిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

నిషేధిత విత్తనాల విక్రయం.. ఐదుగురి రిమాండ్

మాడ్గుల, మే 31 : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన దొడ్డిపురం మల్రెడ్డి, అల్లం మల్రెడ్డి,అల్లం వినోద్‌లు ప్రభుత్వం నిషేధించిన బీటీ-3 రకం పత్తి విత్తనాలను విక్రయిస్తుండగా గురువారం పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. కాగా, అదే కేసును దర్యాప్తు చేస్తుండగా పరారీలో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు శుక్రవారం కేశంపేట మండలానికి చెందిన అన్నపు రెడ్డి మల్లారెడ్డి, షాద్‌నగర్‌లోని లక్ష్మీనరసింహ కాలనీకి చెందిన యర్రదొడ్డి నల్లపురెడ్డిని శుక్రవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు. వారి నుంచి 850 కిలోల విత్తనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కారు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.



మాడ్గుల : పట్టుబడిన పత్తి విత్తనాలు



బషీరాబాద్: నకిలీ విత్తనాలతో పట్టుబడిన వ్యక్తులతో ఎస్ఐ రమేష్, పోలీసులు

శస్త్ర చికిత్సల పేరుతో దోపిడీ

వచ్చీరాని వైద్యంతో ప్రాణాలు హరీ..!

» పరిగి కేంద్రంగా నెలకు 40కిపైగా గర్భసంచి ఆపరేషన్లు

» నార్మల్ డెలివరీకి అవకాశం ఉన్నా తప్పని సిజేరియన్లు

పరిగి, మే 29: ప్రైవేట్ ఆస్పత్రులు సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నాయి. శస్త్ర చికిత్సలు అవసరం లేకున్నా డబ్బుల కోసం అవసరం ఉన్నట్లు సృష్టిస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రైవేట్ ఆస్పత్రుల్లో అర్హత లేకుండా వచ్చీరాని వైద్యంతో పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కాసుల కోసం ప్రైవేటు ఆస్పత్రులు, కమీషన్ కోసం ఆర్ఎంపీ వైద్యులు అమాయిక మహిళలను బలిచేస్తున్నారు. కడుపు నొప్పి, నడుమునొప్పి అని వెళితే చాలు గర్భసంచి తొలగించేస్తున్నారు. వేలకు వేలు దండుకుంటూ గిరిజన తండాలు, గ్రామాల్లోని మహిళల ఆరోగ్యాన్ని హరిస్తున్నారు. పరిగి కేంద్రంగా మహిళలకు గర్భసంచి తీసివేస్తే శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఎక్కువగా గిరిజన మహిళలే బలి పశువులవుతున్నారు. గర్భసంచి తొలగించి ఒక్కో మహిళ నుంచి రూ.40 నుంచి రూ.60వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈవిధంగా పరిగిలో శస్త్ర చికిత్సల ద్వారా నెలకు రూ.20లక్షలకుపైగా లావాదేవీలు జరుగుతున్నట్లు అంచనా. ఇక మందులు, పరీక్షలు ఖర్చులు అదనంగానే వసూలు చేస్తున్నారు. ఇందులో కేసును తీసుకువచ్చే ఆర్ఎంపీ డాక్టర్‌కు కూడా కమీషన్ ఇస్తుంటారు. పరిగి ప్రాంతంలో నెలకు సుమారుగా 40నుంచి 50మంది మహిళలకు గర్భసంచి తొలగించే ఆపరేషన్ చేస్తున్నట్లు సమాచారం. గతంలో ఇతర రాష్ట్రానికి 30ఏళ్ల మహిళకు గర్భసంచి సమస్య ఉందని సూచించారు. ఇక్కడే సదరు మహిళకు ఆపరేషన్ చేసి గర్భసంచిని తొలగించారు. అయితే ఆమె శస్త్రచికిత్సలు వికటించడంతో హైదరాబాద్‌కు తరలించేలోపే మృతి చెందింది. గతంలో పరిగి మండలం నస్కల్ గ్రామానికి చెందిన మరో మహిళ కూడా గర్భసంచి సమస్యతో మృతిచెందిన సంగతి తెలిసిందే. గతేడాది పూడూరు మండలం నిజాంపేట్ మేడిపల్లి గ్రామానికి చెందిన ఓమహిళ ఇదే సమస్యతో మృతిచెందినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఇలా ఒకటా రెండా ఆపరేషన్‌లు వికటించి మృతిచెందుతున్న ఘటనలు కోకొల్లలు. ఇటీవల దోమకు చెందిన ఓ యువతికి సరైన వైద్యం అందకనే మృతి చెందిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల కిందట ఓ ఆర్ఎంపీ దగ్గర ఊటుపల్లికి చెందిన యువకుడికి వైద్యం అందక మృతిచెందాడు. సదరు ఆర్ఎంపీ డబ్బులు ఇచ్చి సెటిల్ చేశారు. దోమలో ఆర్ఎంపీ వైద్యంతో విద్యార్థిని మృతిచెందగా కేసు నమోదు చేసి చేతులు దులుపేసుకున్నారు. ఒక శస్త్ర చికిత్సలు కాకుండా, ఆర్ఎంపీ డాక్టర్లు వచ్చీరాని వైద్యంతో పేదల జీవితాలతో చెలగాటం అడుతున్నారు.



పరిగిలో క్లినిక్‌లో బెడ్లు వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అధికారులు (ఫైల్)

అనుమతులు లేకుండా క్లినిక్‌ల నిర్వహణ

పరిగిలో అనేక క్లినిక్‌లు ఎలాంటి అర్హతలు, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారు. ఆర్ఎంపీ చికిత్సలు చేసే అందిచే క్లినిక్‌లు నర్సింగ్‌హోంలను తలపిస్తున్నాయి. అందులో వచ్చీరాని వైద్యంతో మహిళలకు శస్త్రచికిత్సలు నిర్వహించి పట్టపగలు నిలువుదోపిడీ చేస్తున్నారు. రిజిస్ట్రేషన్‌లు లేకుండా అర్హతలేని ఆస్పత్రులను యథేచ్ఛగానే నడిపిస్తున్నారు. కనీసం మెడికల్ ప్రాక్టీస్ సర్టిఫికెట్లు లేని ఆర్ఎంపీలు ఆస్పత్రులు కొనసాగుతున్నా వైద్యశాఖ అధికారులు అసలు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.రకరకాల ప్రకటలతో ప్రచారం చేసుకుంటూ పేదల జీవితాలతో ఆడుకుంటున్నారు.

నార్మల్ డెలివరీకి అవకాశమున్నా సిజేరియన్లు

గర్భిణులు డెలివరీకి ఆస్పత్రికి వెళ్తే కడుపుకోత చేస్తున్నారు. పరిగి ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెలివరీకి వెళ్లిన వారికి అసలు ప్రయత్నం చేయకుండానే సిజేరియన్లు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. నార్మల్ డెలివరీకి అసలు ప్రయత్నాలు జరగడం లేదు. నార్మల్ డెలివరీ అవడానికి అవకాశమున్నా చేయడం లేదు. డబ్బులకోసం నార్మల్‌ను పక్కన పెట్టి కడుపుకోత చేస్తున్నారు. ఇలాపేదల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వేలకు వేలు దండుకుంటున్నారు. నార్మల్ డెలివరీకి అయితే రూ.20వేలు, ఇదే సిజేరియన్ అయితే రూ.40వేల నుంచి అదను చూసి రూ.80వేల వరకు వసూలు చేస్తున్నారు. పరిగిలో కొడంగల్ వెళ్తే దారిలోఓ ఓ ఆస్పత్రిలో అయితే దోపిడీ మరీ దారుణంగా ఉంది. ఆరోగ్యం బాగా ఉన్నా, శస్త్రచికిత్సలు అవసరం లేకున్నా డబ్బుల కోసం శస్త్ర చికిత్సల పేరిట ఇష్టం వచ్చినట్లు బిల్లులు వేస్తున్నారు. నిలదీసిన వారిని ఇక్కడి నుంచి తీసుకెళ్లాలని దబాయిస్తున్నారు. ఆస్పత్రి నిర్వాహకులు చేతులు తడపడం వల్లే ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పరిగిలో క్లినిక్‌ను సీజ్‌చేస్తున్న అధికారులు (ఫైల్)

'సిజేరియన్లు చేస్తే చర్యలు'

తాండూరు: గర్భిణీలకు తప్పనిసరి అయితేనే సిజేరియన్ ప్రసవాలు చేయాలని జిల్లా మాతా శిశు ఆస్పత్రిల ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయిబాబా అన్నారు. వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. పాల్వాన్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే సీజిరియన్ ప్రసవాలు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి సిజేరియన్ ప్రసవాలు చేస్తే క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కింద ఆస్పత్రితో పాటు గైనకాలజిస్టులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మార్కెట్‌లో రూ.10నోట్ల కొరత



ధారూరు, మే 31: మార్కెట్‌లో రూ.10నోట్ల కొరత నెలకొంది. కొంత కాలంగా మార్కెట్‌లో పది రూపాయల నోట్లు క్రమంగా కనుమరుగవుతూ వస్తున్నాయి. రూ.2వేల నోట్ల రద్దు అయినప్పటి నుంచి బ్యాంకుల్లో రూ.500, రూ.200, 100, 50నోట్ల చెలామణి పెరిగి చిన్న నోట్ల చెలామణి క్రమేణా తగ్గుతూ వస్తోంది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో వివిధ వ్యాపారులు చిల్లర దొరకక ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులతో పాటు వివిధ రకాల వస్తువులు కొనుగోలు కోసం, కూరగాయల మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు చిల్లర సమస్యను ఎదుర్కొంటున్నారు. రూ.50లోపు కొనుగోలుకు నానా అవస్థలు పడాల్సివస్తోందని వాపోతున్నారు. ధారూరు, వికారాబాద్, తాండూర్‌లో ఉన్న జాతీయ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకుల్లో రూ.10నోట్లు అందుబాటులో ఉండటంలేదు. కాగా గతంలో రిజర్వు బ్యాంకు నుంచి విడుదల చేసిన రూ.10నాణేలు చెల్లవని పుకార్లు వ్యాపించటంతో మార్కెట్‌లో ఆ నాణేలను ప్రజలు తీసుకోకపోవడంతో వాటి చెలామణి నిలిచిపోయింది. వీటితో పాటు ఈ మధ్య గ్రామాల్లో రూ.10, 20, 100 పాత నోట్లు చెల్లవనే అసత్య ప్రచారంతో వినియోగదారులు గందరగోళానికి గురవుతున్నారు. రూ. 10 నోట్లను బ్యాంకుల్లో అందుబాటులో ఉంచాలని వ్యాపారులు, ప్రజలు రిజర్వు బ్యాంకు అధికారులను కోరుతున్నారు.

రూ.10నోట్లు దొరకక కష్టమవుతోంది



మార్కెట్‌లో రూ.10నోట్లు దొరకటం లేదు. కిరాణ సామగ్రికి వచ్చే వినియోగదారులు రూ.10నోట్లు తీసుకురావడం లేదు. కొంత కాలంగా రూ.10నోట్లు దొరకక రోజువారీ వ్యాపార లావాదేవీలకు కష్టమవుతోంది. బ్యాంకుల్లో రూ.10నోట్లు దొరకడం లేదు. పెట్రోల్ బంకుల్లో రూ.10నోట్లు చిల్లర తెచ్చుకుని వ్యాపారం నిర్వహిస్తున్నాం. బ్యాంకుల్లో రూ.10నోట్లను అందుబాటులో ఉంచాలి.

- కల్వ కిరణ్ కుమార్, కిరాణ వ్యాపారి, ధారూరు



లక్ష్మీబాయి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డిప్యుటీ సీఎం భట్టి విక్రమార్క, దీపాదాస్‌మున్షీ

పుంజాల లక్ష్మీబాయి మృతికి డిప్యుటీ సీఎం సంతాపం

శంషాబాద్, మే 31 : మాజీ గవర్నర్ దివంగత పుంజాల శివశంకర్ భార్య లక్ష్మీబాయి ఇటీవల మృతిచెందారు. డిప్యుటీ సీఎం భట్టి విక్రమార్క వారింటికి వెళ్లి లక్ష్మీబాయి చిత్రపటానికి నివాళి అర్పించి కుటుంబికులను పరామర్శించారు. శుక్రవారం శంషాబాద్ శివారులోని మామిడిపల్లిలో లక్ష్మీబాయి నివాసానికి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీలు వెళ్లి లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. లక్ష్మీబాయి కుమారుడు డాక్టర్ వినయ్‌కుమార్, కోడలు అలేఖ్యలను ఓదార్చి సానుభూతి తెలిపారు.



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న చుక్కా రామయ్య

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

» ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య

కడ్తాల్, మే 31: విద్యార్థులు ఉన్నతమైన ఆలోచనలతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి అందరికీ ఆదర్శంగా నిలవాలని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య అన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామంలోని శ్రీ రామేశ్వర వీరాంజనేయస్వామి దేవాలయాన్ని శు క్రవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జ్ఞానసరస్వతి మందిరంలో పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ సమాజంలో మార్పులు చోటుచేసుకునేందుకు విద్య ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచి కష్టపడి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. గొప్ప ఆలోచనలు విద్యార్థులు ఉన్నతంగా ఎదగడానికి ఉపకరిస్తాయని చెప్పారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి గ్రామానికి, తల్లిదండ్రులు, గురువులకు మంచిపేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డిలను ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవిందర్‌రావు, మాజీ సర్పంచ్ శంకర్, స్థానికులు జ్ఞానప్రసూనశర్మ, శ్రీరాములు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

» బ్రహ్మోత్సవాలకు రూ.1, 11, 580 ఆదాయం

ఘట్‌కేసర్ రూరల్, మే 31: మండలంలోని వెంకటాపూర్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన హుండీని శుక్రవారం లెక్కించారు. గతనెల 23 నుంచి 26వ తేదీ వరకు జరిగిన ఆలయ బ్రహ్మోత్సవాల హుండీ ఆదాయం రూ.1, 11, 580లు వచ్చినట్లు ఆలయ చైర్మన్ ఉదారి వేణుగోపాల్ తెలిపారు. భక్తులు స్వామివారి హుండీలో వేసిన డబ్బులను ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. జూలైలో ఆలయంలోని ఆంజనేయస్వామి ఆలయంతో ప్రహరీ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎల్.భాగ్యలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు నవీన్, లింగం, శేఖర్, మాజీ సర్పంచ్ నీరుడి గీతాశ్రీనివాస్, నాయకులు పెంటయ్య, వెంకటేష్, శ్రీనివాస్, నర్సింహ, ఆలయ అర్చకుడు వినయ్‌శర్మ పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ఎరువులు దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏసీపీ కేపీవీ రాజు

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

» కృత్రిమ కొరత సృష్టించొద్దు : ఏసీపీ కేపీవీ రాజు

యాచారం, మే 31 : నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించి రైతులను మోసం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ఎరువుల విత్తనాల వ్యాపారులు రాష్ట్ర వ్యవసాయ శాఖ నిబంధనలకు లోబడి విక్రయాలు చేపట్టాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. విత్తనాలు అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో యాచారం, మాల్, మల్కీజ్‌గూడ గ్రామాలలో అధికారులు ఎరువులు, విత్తనాల దుకాణాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ దుకాణదారులు రైతులకు ఎరువులు, విత్తనాలు విక్రయించిన వెంటనే బిల్లు రసీదు ఇస్తున్నారా? లేదా? స్టాక్ రిజిస్టర్‌లు మెయింటెన్ చేస్తున్నారా? విత్తనాలు, ఎరువులు ఎక్కడి నుంచి దిగుమతి చేసుకుంటున్నారనే విషయాలపై ఆరా తీశారు. ఏసీపీ మాట్లాడుతూ ఎరువులు లూజ్‌గా విక్రయించరాదని దుకాణాదారులను ఆదేశించారు. నకిలీ విత్తనాలు విక్రయించి రైతులకు అన్యాయం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ ఎరువుల విక్రయించరాదని దుకాణాదారులను ఆదేశించారు. ఎరువుల కోసం రైతులు ఇబ్బంది పడకుండా ప్రతీరోజు స్టాక్ చూసి ఎరువులు తెప్పించుకోవాలని సూచించారు. మారుమూల గ్రామాలలో బ్లాక్‌లో ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రతీ దుకాణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. కాగా, మాల్ వద్ద నేడు(శనివారం) చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేస్తామని, నకిలీ విత్తనాల తరలింపుపై నిఘా పెట్టనున్నట్లు ఏసీపీ తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి జీఎస్ సందీప్‌కుమార్, సీఐ శంకర్‌కుమార్, ఎస్సై వెంకటనారాయణ, ఆర్ఐ రామకృష్ణ తదితరులు ఉన్నారు.



ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

» కొనసాగుతున్న జాతర » కర్ణాటక, మహారాష్ట్రల నుంచి రాక

తాండూరురూరల్, మే 31: భక్తుల కొంగు బంగారం కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయం జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నిత్యపూజలతోపాటు భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో శుక్రవారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్రతోపాటు తాండూరు చుట్టుపక్కల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక బోనంతో ఆలయం పూజలు నిర్వహించారు. బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యాలు సమర్పించారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త!

- లూజు విత్తనాలు, కంపెనీల ప్రకటనలు చూసి మోసపోవద్దు
- బిల్లులు భద్ర పర్చుకోవాలి
- రైతులకు వ్యవసాయాధికారుల సూచన



బషీరాబాద్‌లోని ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ (ఫైల్)

బషీరాబాద్, మే 31: ఆరుగాలం శ్రమించిన రైతులకు ఫలితం దక్కాలంటే ఆదినుంచే అప్రమత్తంగా ఉండాలి. దుక్కి దున్నింది మొదలు పంటలు చేతికొచ్చే వరకు సాగుకు సంబంధించి అన్ని జాగ్రత్తలు పాటించాలి. ప్రస్తుత సీజన్‌లో రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేస్తున్నారు. ఈ సమయంలో రైతులు ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉండకూడదని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొని మోసపోవద్దని సూచిస్తున్నారు. వారం రోజులుగా గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తూ రైతులకు నకిలీవిత్తనాలపై అవగాహన కలిస్తున్నారు.

విత్తనాలు కొనేముందు..

వ్యవసాయశాఖ లైసెన్సు పొందిన డీలర్ నుంచే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. సరిగ్గా సీల్‌చేసి ఉన్న బస్తాలను ధృవీకరణ పత్రం(ట్యాగ్)ఉన్న వాటినే ఎంపిక చేసుకోవాలి. బస్తా, ప్యాకెట్‌పై గడువు తేదీ, రకం, పేరు, లాట్ నంబర్లను గమనించాలి. కొనుగోలు బిల్లుతో పాటు నంబరు, విత్తనరకం, గడవు తేదీ ఉండేలా డీలర్ సంతకంతో కూడిన రశీదు పొందాలి. రైతు సంతకం కూడా బిల్లుపై ఉండేలా చూసుకోవాలి.ప్రైవేట్ విత్తన సంస్థలు పెద్దఎత్తున చేసే ప్రచారానికి ఆకర్షితులై విత్తనాలు కొనుగోలు చేయకూడదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మార్కెట్‌లో నకిలీ విత్తనాలు అమ్ముతున్నందున తక్కువ ధరకు దొరుకుతాయని తీసుకుని రైతులు మోసపోవద్దు. విత్తనాన్ని ఎంచుకునే ముందు వ్యవసాయాధికారి, శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవడం మంచిది. రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ సరఫరా చేసిన విత్తనాలు ఉంటే వాటిని తీసుకోవడం మంచిది. ఎరువులను కూడా లైసెన్సు ఉన్న దుకాణాల్లోనే కొనాలి. రైతులు తాము కొనుగోలు చేసిన ఎరువులకు సంబంధించి సరైన బిల్లు పొందాలి. మిషన్ కుట్టు ఉన్న ఎరువుల బస్తాలు మాత్రమే కొనాలి.సీసంతో సీల్ ఉందో లేదో నిశితంగా పరిశీలించి చూడాలి. బస్తాపై ప్రామాణిక పోషకాలు, ఉత్పత్తిదారుల వివరాలు ఉండాలి. కొనుగోలు చేసిన ఎరువుల విషయంలో అనుమానం వస్తే వెంటనే వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలి.

ముందు జాగ్రత్త అవసరం



విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల కొనుగోలు విషయంలో ముందు జాగ్రత్త అవసరం. మార్కెట్‌లో దొరికే విత్తనాలను కొని మోసపోవద్దు. రైతులు సీడ్ దుకాణాల్లో కొనే విత్తనాల ఖాళీ ప్యాకెట్లు, సంచులను పంటకాలం పూర్తయ్యేవరకు భద్రంగా దాచి ఉంచాలి. సరిగ్గా మొలకెత్తకపోవడం, పంట దిగుబడి రాకపోవడం లాంటి సమస్యలు వస్తే కంపెనీ నుంచి పరిహారం పొందవచ్చు. అదేవిధంగా కొనుగోలు చేసే ఎరువుల విషయంలో అనుమానం వస్తే వెంటనే వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయాలి. రైతులు విధిగా సంబంధిత వ్యవసాయాధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలి.

- సూర్యప్రకాష్, వ్యవసాయాధికారి, బషీరాబాద్

ఈదురుగాలులకు విరిగిన విద్యుత్ స్తంభం



ఇప్పయిపల్లిలో విరిగిన విద్యుత్ స్తంభం

కులకచర్ల, మే 31: కులకచర్ల మడంలంలోని ఇప్పయిపల్లి గ్రామంలో విద్యుత్ స్తంభం విరిగిపోయి 25 రోజులు గడుస్తున్నా నూతన స్తంభం ఏర్పాటు చేయడం లేదు. గత మే 7న ఈదురు గాలులతో వర్షం కురిసింది. వీచిన గాలులకు గ్రామంలో తాటి చెట్టు కూలి రెండు స్తంభాలు పడిపోయాయి. విద్యుత్ అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఇప్పుడు, అప్పుడు అంటూ రోజులు గడుస్తున్నా పడిపోయిన విద్యుత్ స్తంభం స్థానంలో నూతన స్తంభం ఏర్పాటు చేయడం లేదని గ్రామస్థులు తెలిపారు. గత 25 రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బొంరాస్‌పేట్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా వెంకన్నగౌడ్



వెంకన్నగౌడ్

బొంరాస్‌పేట్, మే 31: బొంరాస్‌పేట్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా సూపరింటెండెంట్ వెంకన్నగౌడ్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీదేవి శుక్రవారం పదవీవిరమణ పొందడంతో ఆమె స్థానంలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.

ధూమపానం హానికరం



కులకచర్లలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి మాధురి

కులకచర్ల, మే 31: ధూమపానం హానికరమని కులకచర్ల ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారిణి మాధురి తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆసుపత్రి ఆవరణలో ప్రజలకు అవగాహన కల్పించారు. పొగాకుతో వ్యాధులు దరిచేరుతాయని తెలిపారు. తంబాకు, గుట్కా లాంటి మత్తు పదార్థాలు ప్రాణాలకు హాని కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో చంద్రప్రకాశ్, వైద్య సిబ్బంది మౌనిక, నవీన్, యాదమ్మ పాల్గొన్నారు.

శామీర్‌పేట: మానవుల ప్రాణాలను హరిస్తున్న పొగాకును సమాజంలోని ప్రతి ఒక్కరు గుర్తించి దాన్ని అంతం చేయాలని డాక్టర్ శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శామీర్‌పేటలోని ప్రభుత్వం కమ్యూనిటి హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో శుక్రవారం ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్లు, వైద్యులు, సిబ్బంది పొగాకు నిర్మూలించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు స్వేత, రవిందర్‌బాబు, సంగీత, సృజన, ఫెలిస్, రాఖేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని దత్తత



కీర్తికి పుస్తకాలు అందజేస్తున్న రాంచందర్ యాదవ్

పూడూరు, మే 31: బేరి వెంకటమ్మ వెంకటయ్య యాదవ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐఏఎస్ చదివించేందుకు విద్యార్థిని దత్తత తీసుకున్నట్లు బీసీ ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బేరి రాంచందర్ యాదవ్ అన్నారు. మండలంలో శుక్రవారం రాంచందర్ యాదవ్ మాట్లాడుతూ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మిద్దెల కీర్తి యాదవ్‌ను ఐఏఎస్ చదివించడానికి దత్తత తీసుకున్నట్లు తెలిపారు. అన్నివిధాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఐఏఎస్ చదివేందుకు అన్నివిధాల సహకరిస్తానని రాంచందర్ యాదవ్ హామీ ఇచ్చారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

బషీరాబాద్, మే 31: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నవాంద్గీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని సేవాలాల్ తండాలో శుక్రవారం అండర్-17 క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు గెలుపోటములు పక్కన పెట్టి ప్రతీఒక్కరు క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. కార్యక్రమంలో స్థానిక యువకుడు నరేష్, తండా యువకులు పలువురు పాల్గొన్నారు.

వృత్తిపరమైన సంఘాలకు ఎన్నికల ప్రతిపాదన

వికారాబాద్, మే 31: జిల్లాలో వృత్తిపరమైన సంఘాల ఎన్నికలకు ప్రతిపాదనలు వచ్చినట్లు జిల్లా సహకార అధికారి ఈశ్వరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ఎన్నికల ప్రతి పాదనలు అందాయని ఆయన తెలిపారు. ఇందులో ఇందులో భాగంగా గొర్ల పెంపకందారుల సహకార సంఘాలు (22), కల్లు గీత కార్మిక సంఘాలు (10), మత్స్య సహకార సంఘాలు(7)తో పాటు ఇతర ఒక సంఘాన్ని కలుపుకొని జిల్లాలో మొత్తం 40సంఘాల ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు.షెడ్యూల్ ఎన్నికల ప్రకారం జూన్ 6వ తేదీ నుంచి జూన్ 28వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలను అసిస్టెంట్ రిజిస్ట్రార్ జె.చంద్రయ్య, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎండీ అజ్మత్‌పాషా, జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నాగశివకుమారిలు పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు.

పత్తిలో ఎన్ని రకాలున్నా ఒకే తరహా దిగుబడి



పరిగి: మాదారంలో అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

పెద్దేముల్, మే 31: పత్తిలో ఎన్ని రకాల విత్తనాలున్నా ఒకే తరహా దిగుబడులను ఇస్తాయని తాండూరు డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏ రుద్ర మూర్తి తెలిపారు. మండలంలోని బండపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడిని పొందవచ్చని చెప్పారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు సంబంధించి తప్పకుండా రసీదు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వినయ్, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: రైతులు పత్తి విత్తనాలు కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలని పరిగి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు లక్ష్మీకుమారి సూచించారు. మండలంలోని మాదారంలో శుక్రవారం పత్తి విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రభాకర్‌రెడ్డి, ఏఈవో చంద్రకళ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పూడూరు: విత్తన డీలర్లు రైతులకు కచ్చితంగా రసీదులు ఇవ్వాలని పరిగి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మీకుమారి అన్నారు. పూడూరు రైతు వేదికలో శుక్రవారం విత్తన డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లక్ష్మీ కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహాయ సంచాలకులు మాట్లాడుతూ డీలర్లు విత్తనాలను రైతులకు విక్రయించినప్పుడు తప్పక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా వారికి రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. విత్తన ప్రాముఖ్యత, చట్టాలపై వివరించారు. చెన్‌గోముల్ ఎస్‌ఐ మధుసూదనరెడ్డి, వ్యవసాయాధికారి తులసీరాం మాట్లాడుతూ డీలర్స్ కచ్చితంగా రిజిష్టర్, బిల్‌బుక్కు ప్రతి రోజు అప్‌డేట్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణాధికారులు శిరీష, వర్ష, రాంబాబు, గీత, ఎలియాస్ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లూజ్ విత్తనాలను కొనుగోలు చేయరాదని దుద్యాల ఏఈవో మొహియొద్దీన్ అన్నారు. దుద్యాల మండల పరిధిలోని అల్లిఖాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం ఉపాధిహామీ పనులు చేస్తున్న రైతుల దగ్గరికి వెళ్లి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన

మేడ్చల్ టౌన్: నకిలీ విత్తనాల పట్ల రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని ఎల్లంపేట గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. నికిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉంటూ గుర్తింపు పొందిన డీలర్ల వద్ద విత్తనాలు కొనాలని సూచించారు. విత్తనాల పట్ల ఎలాంటి ఉనుమానం ఉన్నా వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



రైతు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పూడూరు: టోర్నమెంట్‌లో గోల్డ్ మెడల్ పొందిన విద్యార్థులు

పూడూరు, మే 31: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో జరిగిన జిల్లా స్థాయి కుంఫూ కరాటే టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ బాల్‌రాజ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో పలు జిల్లాల మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో వికారాబాద్ జిల్లా నుంచి ట్రెడిషనల్ జాపాన్ షోటాకాన్ స్పోర్ట్స్ కరాటే దూ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఫౌండర్ జె.శ్రీనివాస్ మదిరాజ్, టీజేఎస్‌కేఏఐ జనరల్ సెక్రెటరీ ఎం.శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పది మంది పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో వైష్ణవి, ఎం.విష్ణేష్, సాత్విక్, అభిషేక్, రిత్విక్, మయాంక్ తదితరులు గోల్డ్‌మెడల్ సాధించారు.

తైక్వాండో శిక్షణ

దోమ: తైక్వాండో వేసవి శిబిరాన్ని మే 1 నుంచి 31 వరకు వికారాబాద్ జిల్లా యూత్, క్రీడల అధికారి హన్మంత్‌రావు ఆదేశాలతో నెల రోజుల పాటు దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మాస్టర్ బోయిని రాములు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో శుక్రవారం జిల్లా క్రీడల అధికారి హన్మంత్‌రావు పాల్గొని మాట్లాడారు. కరాటే ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రాంతి విద్యాలయం కరస్పాండెంట్ కేతకి లింగం, మ్యాజిక్ బస్సు అకాడమి ఇంచార్జ్ సద్గుణ, సీసీ మహేశ్, విద్యార్థుల తల్లిదండ్రులు నర్సిములు, రాఘవేందర్, అశోక్, శ్రీనివాస్, శేఖర్, సుజాత పాల్గొన్నారు.

సీఎంఆర్ విద్యార్థులకు వెండి పతకాలు

మేడ్చల్ టౌన్: జాతీయ స్థాయి ఇంటర్ ఇంటర్సిటీ క్వాన్-కీడోలో గుండ్లపోచంపల్లి కండ్లకోయం సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు వెండి పతకాలను సాధించారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జేజేటీ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయస్థాయి క్వాన్-కీడ్‌లో సీఎంఆర్ కళాశాలకు చెంది. కె.వంశీ మోహన్‌రెడ్డి, గౌతమ్ రెడ్డిలు ప్రతిభను చాటి వెండిపతకాలను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ జంగారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ తోట మోహన్ రావులు విద్యార్థులను అభినందించారు.



మేడ్చల్ టౌన్: వెండి పతకాలను సొంతం చేసుకున్న సీఎంఆర్ విద్యార్థులు

నేడు విద్యుత్ అంతరాయం

తాండూరురూరల్, మే 31: మండలంలోని పలు గ్రామాల్లో నేడు(శనివారం) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వెంకటనాయకుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని కరన్‌కోట్, ఓగీపూర్, చంద్రవంచ, చిట్టి ఘనాపూర్, మల్కాపూర్, కొత్లాపూర్, సంగెంకలాన్, కోటబాస్పల్లి, మిట్టబాస్పల్లి, గుంతబాస్పల్లి, జినుగుర్తి, ఉద్దండాపూర్, సంకిరెడ్డిపల్లి, సంకిరెడ్డిపల్లితండా, సిరిగిరిపేట్, అల్లాపూర్ గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ తెలిపారు.

బొంరాస్‌పేట్: దుద్యాల మండలంలోని హస్నాబాద్ గ్రామంలో 24గంటల పాటు విద్యుత్‌ను సరఫరా చేసే ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సురేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

తాండూరు: విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తాండూరు టౌన్, పెద్దేముల్, కోట్‌పల్లి, తాండూరు మండలాల పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పాడుతుందని విద్యుత్ శాఖ డీఈ భాను ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

శామీర్‌పేట: శామీర్‌పేట సెక్షన్ పరిధిలోని బొమ్మరాసిపేట విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు బొమ్మరాసిపేట ఫీడర్ మరమ్మతులు చేస్తున్నందున బొమ్మరాసిపేట, బాబాగూడ, క్రషర్ మిషన్లకు విద్యుత్ అంతరాయం ఉంటుందని శామీర్‌పేట విద్యుత్ ఏఈ రమేశ్ తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కరకలమ్మ ఫీడర్ మరమ్మతుల కారణంగా బొమ్మరాసిపేట వ్యసాయ క్షేత్రాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ రమేశ్ చెప్పారు.

సైన్స్ ఉపాధ్యాయులతో గణితం చెప్పించే ఉత్తర్వులు సరికావు

వికారాబాద్, మే 31: సైన్స్ ఉపాధ్యాయులతో గణితం చెప్పించే ఉత్తర్వులు సరికావని, విద్యాశాఖ విడుదల చేసిన ఎంఈఎంవో 11143 ను వెంటనే రద్దు చేయాలని ఫిజికల్ సైన్స్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా అధ్యక్షుడు దోమ కమాల్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామర్థ్య వారిగా పరిశీలిస్తే గణిత శాస్త్ర ఉపాధ్యాయులు కేవలం 5 సామర్థ్యాలకు మాత్రమే బాధ్యులని ఒక వేల సైన్స్ ఉపాధ్యాయులు 6,7 తరగతులు గణితం చెప్పడం వల్ల సైన్స్ టీచర్స్ యొక్క సామర్థ్యాలు 7, గణిత సామర్థ్యాలు 5 మొత్తం 12 సామర్థ్యాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఇది ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులపై అధిక పని భారం, తీవ్ర ఒత్తిడిని గురి చేసే విధంగా ఉందన్నారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

మర్పల్లి, మే 31: రెండు రోజుల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల హెచ్‌ఎంలు, కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో రాజమల్లయ్య, యంపీవో సుశీల్‌కుమార్, ఐకేపీ ఏపీయం మధుకర్, పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **తాండూరు రూరల్:** ఈనెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వెంకటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో తొమ్మిది సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతీరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఈపరీక్ష ఉంటుందని తెలిపారు. మొత్తం 1100మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారని తెలిపారు. అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా పరీక్షలు ప్రశాంతంగా రాయాలని సూచించారు.
- **పరిగి:** దళితులపై దాడులు చేసి, కులం పేరుతో దూషించిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ, రుకుంపల్లి గ్రామ దళిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు పరిగిలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు వెంకటయ్య, మాణిక్యం, యాదయ్య పాల్గొన్నారు.
- **వికారాబాద్:** తెలంగాణ స్టేట్ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ నిర్వహిస్తున్న 2024-25 సంవత్సరానికి గానూ మెడిక్లెయిమ్ పాలసీని పునరుద్ధరించడానికి రూ.7కోట్లు విడుదల చేసిన సీఎం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాది అనంతసేన్ రెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు న్యాయవాదుల సంక్షేమ పథకాల కోసం ప్రతి సంవత్సరం మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లుగా రూ.100కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.
- **తాండూరు:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామ పంచాయతీ, మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున ఉదయం 8.30 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ పార్టీ తరుపున ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని కోరారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మూడుచింతలపల్లి, మే 31: గుర్తుతెలియని ఓవ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట్ మండలంలోని మజీద్‌పూర్ గ్రామపరిధిలోని ప్రజయ్ హోమ్స్ మెయిన్‌గేట్ వద్ద స్థానికులకు గురువారం రాత్రి 11గంటలకు గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం కనిపించింది. దీంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడని నీలం రంగు షర్టు, బూడిదరంగు ప్యాంటు ధరించాడని ఐదు అడుగుల ఎత్తు ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ మృతదేహానికి సంబంధించి ఆనవాళ్లు తెలిసిన వారు శామీర్‌పేట్ పోలీసులను 9490617142, 9490617231 సంప్రదించాలని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, మే 31: జీవితంపై విరక్తిచెంది ఓవ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన అద్దంకి శ్రీనివాస్ శివరాజ్‌కుమార్(42) ఘట్‌కేసర్‌లో రేడియం షాప్ నడుపుతున్నాడు. కుటుంబ కలహాలతో తరచూ భార్యతో గొడవపడేవాడు. జీవితంపై విరక్తి చెందిన ఇంట్లో ఎవరూలేని సమయంలో గదిలోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కిందికి దింపి పరిసరాలను పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బ్యాటరీ దుకాణంలో అగ్నిప్రమాదం

- రూ.5లక్షల ఆస్తినష్టం



ఘట్‌కేసర్‌లోని శ్రీరామ బ్యాటరీషాప్‌లో దగ్ధమైన బ్యాటరీలు, మోటార్లు

ఘట్‌కేసర్ రూరల్, మే 31: ప్రమాదవశాత్తు బ్యాటరీ దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న శ్రీరామ దుకాణం యజమాని మేకల శ్రీశైలం గురువారం రాత్రి 8.30గంటలకు దుకాణం బంద్‌చేసి ఇంటికి వెళ్లాడు. దాదాపు 9.40గంటలకు దుకాణంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు శ్రీశైలంకు సమాచారం ఇచ్చి మంటలు ఆర్పేందుకు నీళ్లుచల్లారు. శ్రీశైలం ఫైరింజన్‌కు ఫోన్ చేయగా అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని అగ్నిప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. దుకాణంలో దాదాపు రూ.5లక్షల మేర బ్యాటరీలు, మోటర్లు అగ్నికి ఆహుతైనట్లు వాపోయారు. కష్టపడి పనిచేసుకుంటూ బ్యాంక్‌లో రుణం తీసుకొని దుకాణం పెట్టుకుంటే అగ్నిప్రమాదం జరిగి తీరని నష్టం వాటిల్లిందని శ్రీశైలం కన్నీరుమున్నీరుగా విలపించాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుట్కా పట్టివేత.. వ్యక్తిపై కేసు నమోదు

పరిగి, మే 31: గుట్కాలను విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పరిగి ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. పరిగి పట్టణానికి చెందిన బొంపల్లి నర్సింహులు పరిగిలోని అఫ్జల్ కాంప్లెక్స్ దగ్గర పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం పాన్‌షాపులో తనిఖీలు చేశారు. రూ.4వేల విలువ చేసే గుట్కాలు లభించాయి. గుట్కాలు స్వాధీనం చేసుకుని, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడి అరెస్ట్

తాండూరు రూరల్, మే 31: బాలికను కిడ్నాప్‌చేసి అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిని కరన్‌కోట్ పోలీసులు అరెస్ట్ చేశారు. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాండూరు మండలంలోని ఓ గ్రామానికి చెందినబాలికను అదే గ్రామానికి చెందిన వడ్డె వీరేశం ఈనెల 22వ తేదీన కిడ్నాప్ చేశాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేశారు. ఈ మేరకు వీరేశంపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి శుక్రమం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. ముగ్గురికి గాయాలు

దౌల్తాబాద్, మే 31: అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తాపడిన ఘటన దౌల్తాబాద్ మండలంలో శుక్రవారం జరిగింది. మండలంలోని దేశాయిపల్లి గ్రామ పంచాయతీ మామిడికుంట తండాలో ఉపాధిహామీ పనుల్లో భాగంగా ఒండ్రు మట్టి తరలింపులో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడగా ముగ్గురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని చికిత్స కోసం కోస్గి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రక్షణ చర్యలు చేపట్టని ఇంటి యజమానిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, మే 31: ఇంటి నిర్మాణంలో రక్షణచర్యలు చేపట్టని ఇంటి యజమానిపై ఘట్‌కేసర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అవుషాపూర్ వీబీఐటీ కళాశాల సమీపంలో రాహుల్ అనే వ్యక్తి కొత్త ఇంటిని నిర్మిస్తున్నాడు. పనిఉందని మేస్త్రీ జానీ, బాల్‌రాజ్ అనే దినసరి కూలీని తీసుకెళ్లాడు. ఈక్రమంలో బాల్‌రాజ్ ఇంటి పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి పడిపోయాడు. దీంతో బాల్‌రాజ్ తల, వెన్నెముక, కాళ్లకు గాయాలయ్యాయి. వైద్యం చేయిస్తామని చెప్పి బాల్‌రాజ్‌ను సమీపంలోని ఎయిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లి అతడి భార్య సుగుణకు అప్పగించి వెళ్లిపోయారు. రక్షణచర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేసిన మేస్త్రీ జానీ, ఇంటి యజమాని రాహుల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడి భార్య పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

వికారాబాద్, మే 31: తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తొమ్మిది మంది సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ ద్వారా స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించినట్లు సీఐ నాగరాజు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం బాధితులకు అందజేసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న తొమ్మిది మంది బాధితుల ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వెతికి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సెల్‌ఫోన్ల విలువ సుమారు రూ.2,05,000 ఉంటుందని తెలిపారు.

'బడిబాట'ను విజయవంతం చేయాలి



సమీక్షలో పాల్గొన్న ఆర్డీవో శ్రీనివాస్

కొడంగల్, మే 31: ఈనెల 3వ తేదీ నుంచి 19వ వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తాండూర్ ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం బడిబాట కార్యక్రమంపై పాఠశాలల హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, తహసీల్దార్, ఎంఈవో, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. బడిబాట కార్యక్రమాన్ని ఈ నెల 3 నుంచి 19 వరకు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందన్నారు. కార్యక్రమ నిర్వాహణకు సంబంధించిన మార్గదర్శకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. పిల్లల తల్లిదండ్రుల్లో చదువు పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. బడిబాట కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు.

దోమ: మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల ప్రత్యేకాధికారి హన్మంత్‌రావు శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో బడీడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. విద్యాశాఖ, మహిళా సంఘాలు, ఐకేపీ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వేతో బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మహేశ్‌బాబు సూచించారు. ఈ సమావేశంలో ఎంఈవో, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.